నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
12 | మంగళవారం 18 మార్చి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట సమ్మెలో వంట చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

అంగన్‌వాడీల పోరుబాట

డిమాండ్లను పరిష్కరించాలని కలెక్టరేట్ల ఎదుట ధర్నా

- ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేస్తే ఊరుకోబోమని హెచ్చరిక
- పీఎంశ్రీ, మొబైల్ సెంటర్లను రద్దు చేయాలని డిమాండ్

మంచిర్యాల, మార్చి 17(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు కలెక్టరేట్‌ల ఎదుట ధర్నాలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని కలెక్టరేట్‌ల ఎదుట ఈ మేరకు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వంటా వార్పు చేసుకుంటూ 48 గంటలపాటు నిరసనను కొనసాగించనున్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసీడీఎస్(ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్)ను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. నూతన జాతీయ విద్యా విధానం పేరిట పీఎం శ్రీ, మొబైల్ అంగన్‌వాడీ సెంటర్స్ తీసుకొచ్చి ఐసీడీఎస్‌ను మూసివేయాలని చూస్తే ఊరుకోబోమని మండిపడ్డారు. రాష్ట్రంలో ఈ చర్యలను వెంటనే ఆపాలని, జాతీయ విద్యా విధానం చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేసేది లేదని అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. 50 ఏండ్లుగా ప్రీ స్కూల్ విద్యను అందిస్తున్న అంగన్‌వాడీ సెంటర్లకు అదనపు పనులు, ఆన్‌లైన్ పనులు తగ్గించి బడ్జెట్ పెంచి అంగన్‌వాడీ సెంటర్లనే సర్సరీ కేంద్రాలుగా మార్చాలన్నారు. ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఐసీడీఎస్ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలు పోరాటాలకు సిద్ధమయ్యామన్నారు. ప్రభుత్వం మా న్యాయమైన 23 డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట తెంలగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్స్..

- ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలి.
- ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎం శ్రీ పథకం, మొబైల్ అంగన్‌వాడీ సెంటర్లను రద్దు చేయాలి. కేంద్రం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలి.
- అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు గ్రాట్యూటీ వర్తింపజేసి, పర్మినెంట్ చేయాలి.
- కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరిచిన రూ.18 వేల వేతనం, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి.
- మినీ టీచర్లకు 10 నెలలుగా బకాయిపడిన వేతనాలు చెల్లించాలి. హెల్పర్లను నియమించాలి.
- మంత్రి సీతక్క హామీ మేరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచుతూ కొత్త జీవో ఇవ్వాలి. ఎలాంటి షరతులు లేకుండా ఆసరా పింఛన్లు ఇవ్వాలి.

❖ రిటైర్మెంట్ బెనిఫిట్స్ కొనసాగించాలి..

అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలి. గత ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రకటించింది. వాటిని కొనసాగిస్తామని మంత్రి సీతక్క గతంలో చెప్పారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఎలాంటి షరతులు లేకుండా రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి. రూ.18 వేల వేతనం, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి. ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయకుండా అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి. జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయబోమని రేవంత్‌రెడ్డి సర్కార్ అసెంబ్లీ సాక్షిగా తీర్మానం చేయాలి. **- భానుమతి, అంగన్‌వాడీ టీచర్, మంచిర్యాల**

❖ ఐసీడీఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేయద్దు..

ఏండ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలకు ప్రీ స్కూల్ విద్యను అందిస్తూ మహిళలు, చిన్నారుల్లో పోషకాహార లోపాలను నిర్మూలించేందుకు పని చేస్తున్న అంగన్‌వాడీలను నిర్వీర్యం చేయడం సరికాదు. మా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి. ఐసీడీఎస్ వ్యతిరేక విధానాల అమలును వెంటనే ఆపేయాలి. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో స్పష్టమైన ప్రకటన చేయాలి.
- కుందారపు స్వాతి, హెల్పర్ మంచిర్యాల

ఇంకా 12 రోజులే..

- ఆస్తి పన్ను వసూలు లక్ష్యం సాధ్యమయ్యేనా !
- మొండి బకాయిదారులకు రెడ్‌నోటీసులు
- ఆస్తుల జప్తునకు ప్రత్యేక బృందాలు



మంచిర్యాలలో ఆస్తి పన్ను చెల్లించలేదని షెడ్‌కు తాళం వేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

మంచిర్యాలటౌన్, మార్చి 17 : 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు ఇంకా 12 రోజులే ఉంది. ఈ లోగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో వంద శాతం ఆస్తి పన్ను వసూలు లక్ష్యాన్ని చేరుకోవడం సందేహంగానే ఉంది. మంచిర్యాల మున్సిపాలిటీ జనవరి 27 నుంచి కార్పొరేషన్‌గా మారడం, ఇందులో నస్పూర్ మున్సిపాలిటీతో పాటు హాజీపూర్ మండలంలోని ఎనిమిది గ్రామాలు విలీనమయ్యాయి. ఈ ప్రాంతాల్లో పన్ను వసూళ్ల కోసం కార్పొరేషన్ సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో 45327 భవనాలు ఉన్నాయి. వీటిలో 41479 నివాస భవనాలు, 1977 కమర్షియల్ భవనాలు, 1871 మిక్స్‌డ్ ఉపయోగిత భవనాలున్నాయి. వీటి మీద ఏడాదికి రూ. 26.87 కోట్లు పన్ను వసూలు లక్ష్యంగా ఉండగా ఇప్పటివరకు కేవలం రూ. 11.93 కోట్లు (44.35 శాతం) మాత్రమే వసూలు చేశారు. మార్చి నెలాఖరులోగా సాధ్యమైనంతగా ఆస్తి పన్ను వసూలు చేయడంపై కార్పొరేషన్ అధికారులు దృష్టి నిలిపారు. కార్యాలయంలోని అన్ని విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందిని పన్ను వసూళ్లకోసం నియమించారు. ఆస్తిపన్ను వసూలుకోసం ప్రతిరోజూ ఉదయం 8 గంటలకే విధుల్లో వెళ్లి పన్ను బకాయి ఉన్న భవనాల యజమానులను నేరుగా కలిసి పన్నులు చెల్లించాలని కోరుతున్నారు. మొండి బకాయిదారులకు ఇప్పటికే రెడ్‌నోటీసులు అందించారు. ఇంటింటికీ చెత్తను సేకరించే వాహనాల ద్వారా మైకులలో ప్రచారం చేస్తున్నారు. పట్టణంలోని 15 ప్రధాన కూడళ్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మార్చి నెల మొదటి వారం నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న అధికారులు పన్ను చెల్లించని భవన యజమానుల ఆస్తుల జప్తుకు నిర్ణయం తీసుకున్నారు. స్పందించని యజమానులకు సంబంధించిన ఇండ్లు , దుకాణాలకు తాళాలు వేస్తున్నారు. ఇంట్లో ఉన్న టీవీ, సోఫా, ఫ్రిజ్‌లు తీసుకువెళ్తామని ముందస్తు హెచ్చరికలు జారీచేస్తున్నారు. పలుచోట్ల అధికారులతో భవన యజమానులు వాదనలకు దిగుతున్నారు.

పాదయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

పాదయాత్రకు మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మద్దతు

మంచిర్యాలటౌన్, మార్చి 17: రైతు సమస్యలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు విన్నవించేందుకు రైతుల పక్షానా రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చేపట్టిన పాదయాత్రకు మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు మద్దతు పలికారు. పాదయాత్ర ప్రారంభించిన గోదావరిఖనిలోని సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్దకు చేరుకుని కోరుకంటి చందర్‌కు మద్దతు తెలిపారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుతో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. 14 నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో సాగునీరు, తాగునీరు కోసం రైతులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులపై రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చేపట్టిన పాదయాత్రకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలుపాలని కోరారు. చేతగాని ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

ధర్నా చేస్తున్న ఆశ్రమ పాఠశాలల కార్మికులు

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

ధర్నాలతో హోరెత్తిన కలెక్టరేట్

- కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఉద్యోగులు, కార్మికుల నిరసన

కుమ్రం భీం ఆసిఫాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్ సోమవారం ఉద్యోగులు, కార్మికుల ధర్నాలతో హోరెత్తింది. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఆశ్రమాల్లోని కార్మికులు వందలాదిగా తరలివచ్చి కలెక్టరేట్ వద్ద ఆందోళనలు చేపట్టారు. ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చిన రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అసంఘటిత కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీఐటీయూ నాయకులు విమర్శించారు. ధర్నాల నేపథ్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్మికులను కలెక్టరేట్‌లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. దీంతో కార్మికులు కలెక్టరేట్ గేటు పక్కన టెంట్లు వేసుకొని ధర్నాకు దిగి నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తలు మాట్లాడుతూ రూ.18 వేల వేతనం చెల్లించాలని, ఉద్యోగోన్నతులు, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న కార్మికులు మాట్లాడుతూ 64 జీవోతో నష్టపోతున్నామని, పాత జీవో ప్రకారం వేతనాలివ్వాలన్నారు. కొత్త మెనూతో పని భారం పెరిగిందని, కార్మికుల సంఖ్య పెంచాలని, ఉద్యోగ భద్రత, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్మికుల కనీసం వేతనాన్ని పెంచాలని అర్హులైన వారిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బ్రహ్మచారి, టేకం ప్రభాకర్, బిందు, దుర్గం దినకర్, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

మంచిర్యాల అర్బన్ : దవాఖానను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల అర్బన్, మార్చి 17: జిల్లాలోని ప్రభుత్వ, ప్రాథమిక, సామాజిక దవాఖానల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులు, సిబ్బందిని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలోని ఆరోగ్యశ్రీ, సాధారణ, డయాలసిస్ వార్డులు, ల్యాబ్, మందుల నిల్వలు, రిజిస్టర్లు, హాజరు పట్టికలు, పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానల్లో రోగులకు సరిపడా బెడ్లు, దుప్పట్లు, పౌష్టికాహారం, మందులు, తదితర సదుపాయాలు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. నూతన భవనం నిర్మాణాన్ని 3 నెలల్లో పూర్తి చేసి దవాఖానను అందులోకి తరలిస్తామని వెల్లడించారు. విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, సమయ పాలన పాటించాలని, రోగుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని, దవాఖానలో పారిశుధ్యంపై శ్రద్ధ చూపాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. అనంతరం రోగులు, వారి సహాయకులతో మాట్లాడి వసతులపై ఆరాతీశారు. ఆయన వెంట దవాఖాన పర్యవేక్షకుడు హరీశ్ చంద్రారెడ్డి, ఆర్ఎంవో భీష్మ ఉన్నారు.

పదవ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

నస్పూర్, మార్చి 17 : మంచిర్యాల జిల్లాలో ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరగనున్న పదవ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతీలాల్, డీసీపీ భాస్కర్, మంచిర్యాల, జైపూర్ ఏసీపీలు ప్రకాశ్, వెంకటేశ్వర్లు, డీఈవో యాదయ్యతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. పరీక్షల కోసం జిల్లాలో 49 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి, అధికారులను నియమించామని, జిల్లాలో 9,189 మంది రెగ్యులర్, 221 మంది ఒక్కసారి అనుత్తీర్ణులైన వారు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో వసతులు కల్పిస్తామని, 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు తెలిపారు. డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్, డీఐఈవో అంజయ్య, అధికారులు పాల్గొన్నారు.

పొనకల్ వద్ద పిచ్చిమొక్కలతో నిండిన కాలువ

కాలువ ఇట్లా.. సాగునీరు ఎట్లా..?

జన్నారం, మార్చి 17 : మండలంలోని పొనకల్ గ్రామంలోని ఆయకట్టుకు నీరందించే 13-డిస్ట్రిబ్యూటరీ కాలువ పిచ్చిమొక్కలతో నిండిపోయింది. దీంతో సాగు నీరు అందక ఆయకట్టు రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ కాలువ కింద నీరు అందుతుందో లేదోనని కొంత మంది రైతులు సాగు విస్తీర్ణాన్ని తగ్గించారు. పంటలు వేసిన రైతులకైనా నీరందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నీటి పారుదల శాఖ అధికారులు స్పందించి కాలువలో పిచ్చిమొక్కలు, పూడికను తీసి ఆయకట్టుకు సాగునీరందించాలని రైతులు కోరుతున్నారు.

ఆర్టీసీ కార్గో బుకింగ్ సేవలు ప్రారంభం

ఇంటివద్దకే 'భద్రాద్రి' తలంబ్రాలు

తలంబ్రాల కోసం బుకింగ్ చేసి ప్రారంభిస్తున్న డీఎం జనార్ధన్

మంచిర్యాలటౌన్, మార్చి 17: ఏప్రిల్ 6న భద్రాచలం ఆలయంలో నిర్వహించే సీతారామ కల్యాణానికి సంబంధించిన ముత్యాలతో కూడిన తలంబ్రాలను ఆర్టీసీ కార్గో ద్వారా ఇంటి వద్దకే పంపిణీ చేసే సేవల బుకింగ్‌ను సోమవారం మంచిర్యాల డిపో మేనేజర్ ఎస్ జనార్దన్ ప్రారంభించారు. ముందుగా ఆయన తలంబ్రాలను బుక్ చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ సీతారాముల కల్యాణ వేడుకలను నేరుగా వెళ్లలేని వారు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 6వ తేదీలోగా మంచిర్యాల, పరిసర ప్రాంతాల ప్రజలు తమ పేరు, ఇంటి చిరునామాను తెలియజేస్తే రూ. 151 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు లాజిస్టిక్ ఇన్‌చార్జి ఫోన్ నంబర్ 7382841860, డీఎంటీలు 9866771482, 9154298541 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ దేవపాల, అకౌంట్స్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, కార్గో సిబ్బంది పాల్గొన్నారు.